జీగిరాం జ్యూట్ మిల్లు తెరిపించాలి

కార్మికశాఖ కమిషనర్‌కు సిఐటియు వినతి

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని జీగిరాం జూట్ మిల్లును వెంటనే తెరిపించి రోడ్డున పడ్డ కార్మికులను ఆదుకోవాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు, ఎవి నాగేశ్వరరావు, కె.సుబ్బారావమ్మ, కోశాధికారి కెఆర్‌కె మూర్తి కోరారు. బుధవారం రాష్ట్ర కార్మికశాఖ కమిషనర్ శేషగిరిరావును కలిసిన సిఐటియు రాష్ట్ర ప్రతినిధి బృందం జీగిరాం జూట్ మిల్లు కార్మికుల సమస్యల్ని వివరించారు. మిల్లు అక్రమంగా లాకౌట్ ప్రకటించడంతో 1200 కార్మిక కుటుంబాలు అర్థాకలితో అలమటిస్తున్నారని చెప్పారు. జాయింట్ కమిషనర్ వద్ద కార్మిక సంఘాల జెఎసితో చర్చలకు రెండు సార్లు యాజమాన్యం గైర్హాజరైందని తెలిపారు. మిల్లు లీజుకు ఇచ్చామనే సాకు చూపి యాజమాన్యం చర్చలకు హాజరు కావడం లేదని చెప్పారు. వెంటనే మిల్లు తెరిపించి కార్మికులను ఆదుకోవాలని సిఐటియు రాష్ట్ర ప్రతినిధి బందం కమిషనర్ శేషగిరిరావును కోరింది.

భవన నిర్మాణాలు వేగవంతం

- కొత్తగా 27 వేల ఇళ్లు మంజూరు
- గురజాడ స్మారక భవనం నిర్వహణకు ప్రతినెలా రూ.10 వేలు
- జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో తీర్మానం
- అజెండాలోని పలు అంశాలపై కీలక చర్చ

సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ సిఎం రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోటగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో చేపట్టిన భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా పరిషత్తు సర్వ సభ్య సమావేశం నిర్ణయించింది. ఇందుకనుగుణంగా తక్షణ చర్యలు చేపట్టాలని అభిప్రాయపడింది. విజయనగరం, పార్వతీపురం ఉమ్మడి జిల్లాలో కొత్తగా 27వేల ఇళ్లను మంజూరు చేసినట్టు సమావేశంలో చర్చకు వచ్చింది. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను చేపట్టని పట్టాలను రద్దుచేసి, వాటిని అర్హులైన ఇతర పేదలకు కేటాయించాలని సమావేశంలో పలువురు సూచించారు. ముఖ్యంగా గురజాడ స్మారక భవనం నిర్మాణానికి జెడ్‌పి తరపున సహకారం అందించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేసిన విజ్ఞప్తి మేరకు నెలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేసేందుకు సర్వసభ్య సమావేశం తీర్మానించింది.

జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం జరిగిన జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో పలు అంశాలు కీలక చర్చకు వచ్చాయి. తొలుత మహాకవి గురజాడ అప్పారావుకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోలగట్ల విజ్ఞప్తి మేరకు గురజాడ స్మారక భవన నిర్వహణకు నెలకు రూ.10 వేలు చొప్పున కేటాయిస్తూ తీర్మానిస్తున్నట్లు జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రకటించగానే హర్షధ్వానాలు మిన్నంటాయి. సభ్యులంతా చప్పట్లతో తీర్మానాన్ని ఆమోదించారు. గురజాడ పేరు చిరస్థాయిగా నిలిచిపోయేందుకు మరిన్ని కార్యక్రమాలను చేపడతామని చైర్మన్ ప్రకటించారు. ఆయన రాసిన దేశమంటే మట్టికాదోయ్... దేశమంటే మనుషులోయ్ అనే పంక్తులు ప్రపంచానికి ఆదర్శమన్నారు. గత సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న చర్యలను జెడ్‌పి సిఇఒ కె.రాజ్‌కుమార్ వివరించారు. గరుగుబిల్లి, బలిజపేట మండలాలను పార్వతీపురం విద్యుత్తు సబ్‌డివిజన్‌లో చేర్చినట్లు తెలిపారు. విజయనగరం మండలంలో మరో పిహెచ్‌సి ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. వాలంటీర్ల జీతాల సమస్యతోపాటు పలు ఇతర సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. అనంతరం గృహనిర్మాణం, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ పనులు, డిఆర్‌డిఎ, విద్య, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం తదితర అంశాలపై చర్చించారు.

ఉమ్మడి జిల్లాలో కొత్తగా సుమారు 27 వేల ఇళ్లను మంజూరు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు జెడ్‌పి చైర్మన్ తెలిపారు. విజయనగరం జిల్లాలో 15,040 ఇళ్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో 11,800 ఇళ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు గృహనిర్మాణంపై జరిగిన సుదీర్ఘ చర్చలో తెలిపారు. ఇవన్నీ వ్యక్తిగత ఇళ్లు మాత్రమేనని, ప్రస్తుతం కాలనీల్లో ఇళ్లు మంజూరు చేయడం లేదని వివరించారు. ఇప్పటికే మంజూరై, నిర్మాణాన్ని ప్రారంభించని ఇళ్లను రద్దు చేసి, వాటి స్థానంలో కొత్తవారికి మంజూరు చేయాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చినప్పలనాయుడు, బొత్స అప్పలనరసయ్య, పాముల పుష్పశ్రీవాణి, అలజంగి జోగారావు, కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, పలువురు జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు మాట్లాడారు. తమ ప్రాంతంలోని గృహనిర్మాణ పరిస్థితి, సమస్యలపై చర్చించారు. వారి సూచనలను పరిగణనలోకి తీసుకొని కొత్త ఇళ్ల మంజూరుకు సమగ్ర ప్రాజెక్టు రిపోర్టును తయారు చేయాలని, రెండు జిల్లాలో హౌసింగ్ పీడీలను చైర్మన్ ఆదేశించారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి కావాలి

ఉపాధి హామీ కింద చేపట్టిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల పనులు త్వరగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను జెడ్‌పి చైర్మన్ ఆదేశించారు. వీటిని సత్వరమే పూర్తి చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అదనంగా నిధులను కేటాయించిందని, వాటిని సంబంధిత కాంట్రాక్టర్‌కు వెంటనే చెల్లించాలని సూచించారు. ఈ పనుల్లో విత్‌హెల్డ్, క్వాలిటీచెక్ కోసం నిధులను పెండింగ్ పెట్టకూడదని స్పష్టం చేశారు. ఇవే కాకుండా ప్రాధాన్యేతర పనులు, జిజిఎంపి పనులను కూడా సత్వరమే పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం ఎమ్మెల్యేల ద్వారా ప్రతి మండలానికి రూ.60 లక్షలు విడుదల చేసిందని, జెడ్‌పిటిసిల వద్ద జెడ్‌పి నిధులు రూ.15 లక్షలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. వాటిని సకాలంలో వినియోగించి, సిసి రోడ్లు తదితర అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డిసిసిబి చైర్మన్ వి.వి.చినరామినాయుడు, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఉమ్మడి జిల్లాల జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వందశాతం ఇ-పంట నమోదు కావాలి

జిల్లాలో ఏ ఒక్క రైతు కూడా నష్టపోకుండా, వంద శాతం ఇ-క్రాప్ నమోదు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. వ్యవసాయ శాఖపై జరిగిన చర్చ సందర్భంగా, ఇ-పంట నమోదులో తలెత్తుతున్న పలు సమస్యలను ప్రజాప్రతినిధులు ప్రస్తావించారు. భూములతో సంబంధం లేకుండా, సాగు చేసిన ప్రతి పంటా ఇ-క్రాప్‌లో నమోదు కావాలని జెడ్‌పి చైర్మన్ కోరారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ కోసం పటిష్టమైన కార్యాచరణ రూపొందిస్తున్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి, మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ గోవిందరావు తెలిపారు. జిపిఎస్ ఉన్న వాహనాలను మాత్రమే ధాన్యం రవాణాకు వినియోగిస్తామని, గోనె సంచులను మిల్లర్లే సమకూర్చుకోవాల్సి ఉంటుందని వారు స్పష్టం చేశారు.

వైద్య పరీక్షల అనంతరం పింఛను

ఆధార్ కార్డులో పొరపాటున వయసు తక్కువగా నమోదైన వారికి, వైద్య పరీక్షల అనంతరం అర్హులని తేలితే పింఛను మంజూరు చేసే అవకాశం ఉందని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. దీనికోసం అటువంటి వారు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో దరఖాస్తు చేసుకుంటే, ఎంపిడిఒల ద్వారా దరఖాస్తులు వస్తాయని చెప్పారు. వారిని మెడికల్ బోర్డుకు పంపించి, వయసు నిర్ధారణ చేయనున్నట్లు వివరించారు. వారి వాస్తవ వయసు ఆధారంగా ఆధార్ కార్డును సవరించి, అన్ని అర్హతలు ఉంటే కొత్తగా పింఛను మంజూరు చేసే అవకాశం ఉందని తెలిపారు. అర్హత ఉండి, ఇప్పటికే పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నవారికి జనవరిలో కొత్త పింఛన్లు మంజూరవుతాయని చైర్మన్ చెప్పారు.

చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

చిరు ధాన్యాలు ప్రాసెసింగ్ యూనిట్లకు సిఎం శంకుస్థాపన

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో రెండు చిరు ధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బుధవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. రెండు చిరు ధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లకు మండలంలోని చందలంగి, పాలకొండ మండలం అట్టలిలో 50 సెంట్ల చొప్పున భూమి కేటాయించారు. ఒక్కొక్క యూనిట్ విలువ రూ.4.65 కోట్లు. జిల్లాలో రూ.9.30 కోట్ల విలువైన యూనిట్లు ఏర్పాటు కానున్నాయి. ఒక్కో యూనిట్‌లో దాదాపు 200 మందికి నేరుగా ఉపాధి అవకాశాలు ఉన్నాయి. రైతులందరికీ మంచి లాభాలు వచ్చేలా చిరు ధాన్యాలను యూనిట్లు కొనుగోలు చేస్తాయి. మిల్లెట్ పౌడర్, మిల్లెట్ మాల్ట్, మిల్లెట్ ముద్దలు, మిల్లెట్ బిస్కెట్స్, మిల్లెట్ జావా, మిల్లెట్ ఇడ్లి, మిల్లెట్ దోసలు వేసే పౌడర్ తదితర విధాలా ఉపయోగించే ఉత్పాదకాలను తయారీకి అనువైన పదార్థాన్ని ఇక్కడ తయారు చేస్తారు.

అనంతరం కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో చిరు ధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లు రావడం ముదావహం అన్నారు. జిల్లాలో చోడి పంటను 3116 ఎకరాల్లో, కొర్ర పంటను 375 ఎకరాల్లో, సామ పంటను 551 ఎకరాల్లో, జొన్న పంటను 241 ఎకరాల్లో, గంటెలు 86 ఎకరాల్లో 3640 మంది రైతులు పండిస్తున్నారని చెప్పారు. అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరంలో భాగంగా రైతులను ప్రోత్సహిస్తున్నామని, అధిక దిగుబడులిచ్చే విత్తనాలు ఇస్తున్నామని, చిరు ధాన్యాల ప్రాధాన్యత తెలియజేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా స్థానికంగా యూనిట్ల శిలా ఫలకాలను జిల్లా కలెక్టర్ లాంఛనంగా ఆవిష్కరించారు. వర్చువల్ విధానంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఫుడ్ ప్రాసెసింగ్ కార్యనిర్వాహక అధికారి కె. సత్యనారాయణ రెడ్డి, వెలుగు ఎపిడి వై.సత్యం నాయుడు, రెండు గ్రామాల సర్పంచులు, చిరు ధాన్యాలను పండించే రైతులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ పనులు పూర్తి చేయాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ పరిధిలో జరుగుతున్న ఇంజినీరింగ్ పనులను వేగవంతం చేయాలని ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి అన్నారు. బుధవారం అన్ని శాఖల ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం పిఒ మాట్లాడుతూ గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. జల జీవన్ మిషన్ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. హౌసింగ్ లే అవుట్లకు నీరు సౌకర్యం కల్పించాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఉన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రాధాన్యత భవనాలను పూర్తి చేయాలని పీఆర్ అధికారులకు సూచించారు. పర్యాటక ప్రాజెక్ట్ పనులను త్వరగా పూర్తి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. గిరిజన గ్రామాల రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. సమావేశంలో ఇఇ సింహాచలం, డిఇలు కృష్ణకుమార్, ఢిల్లేశ్వరరావు, లోకనాథం, సిమ్మన్న, ఎఇలు తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి ఇవిఎంల మొదటి దశ తనిఖీలు

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఇవిఎంల మొదటి దశ తనిఖీలు ఈనెల 16 నుండి ప్రారంభమవుతుందని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు పునశ్చరణ, ఇతర ఎన్నికల సంబంధిత అంశాలపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాలెట్ యూనిట్ 3250, కంట్రోల్ యూనిట్లు 2560, వివిపాట్ లు 3170 కేటాయించారని అందులో ఒక వివిపాట్ మినహా మిగిలినవి జిల్లాకు చేరాయని చెప్పారు. వీటి మొదటి దశ తనిఖీలు ఈనెల 16 నుంచి ప్రారంభమవుతుందని, తనిఖీలు ప్రతి రోజూ ఉదయం 8.30 గంటలకు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఆయా రోజుల్లో పార్టీల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. ఈనెల 27న సమీకృత ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ జరుగుతుందని వివరించారు. ఈనెల 27 నుంచి డిసెంబరు 9 వరకు క్లైమ్స్, అభ్యంతరాలు స్వీకరణ జరుగుతుందని, డిసెంబరు 26 నాటికి వాటిని పరిష్కరిస్తామని ఆయన అన్నారు. జిల్లాలో కొత్తగా ఏడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుకు ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు సమర్పించినట్టు తెలిపారు. జిల్లాలో 1024 పోలింగ్ కేంద్రాలుండగా, కొత్తగా ఏడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించామన్నారు. 26 పోలింగ్ కేంద్రాల లొకేషన్ మార్పుకు, 32 పోలింగ్ కేంద్రాల పేర్లు మార్పుకు కూడా ప్రతిపాదనలు సమర్పించామని తెలిపారు. జిల్లాలో ఏప్రిల్ 15 నుంచి అక్టోబరు 3 వరకు 18088 ఓట్లు చేర్చామని, 20236 ఓట్లు తొలగించామని, 63965 ఓటర్ల వివరాల్లో మార్పులు చేర్పులు చేసినట్టు తెలిపారు.

ఫారం - 6 కింద 20,027 దరఖాస్తులు అందగా 473 తిరస్కరించామని, 18088 మందిని ఓటరు జాబితాలో చేర్చినట్టు తెలిపారు. వీటిలో 1191 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఫారం-7 కింద 24031 దరఖాస్తులు అందగా 1380 దరఖాస్తులు తిరస్కరించగా, 20,236 మందిని ఓటరు జాబితాలో చేర్చగా, 1664 పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఫారం-8 కింద 73343 దరఖాస్తులు అందగా, 814 తిరస్కరించగా, 63965 మందిని ఓటరు జాబితాలో చేర్చామని, ఇంకా 4738 పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో డిఆర్‌ఒ జె.వెంకటరావు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విశాఖ ఉక్కు పరిరక్షణ బహిరంగ సభ

పార్వతీపురం టౌన్ : విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం గురువారం విశాఖపట్నంలోని కూర్మన్నపాలెం స్టీల్ ప్లాంట్ ఆర్చ్ వద్ద జరుగు బహిరంగ సభకు ప్రజలు రావాలని సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకట రమణ, పాకల సన్యాసిరావు, బి.సూరిబాబు కోరారు. ఈ బహిరంగ సభలో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రసంగిస్తారని అన్నారు. కావున జిల్లా ప్రజలంతా ఈ బహిరంగసభకు హాజరై విజయవంతం కావాలని పిలుపునిచ్చారు.

ప్రారంభం కాని ఇంటర్నల్ రోడ్డు పనులు

- ఏడాది క్రితమే టెండర్లు ఖరారు
- నోటీసులిచ్చినా స్పందించని కాంట్రాక్టర్లు
- జగనన్న లేఅవుట్లలో పేదల ఇక్కట్లు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణానికి సంబంధించిన జగనన్న లేఅవుట్లలో ఇళ్లు నిర్మిస్తున్న లబ్దిదారులు నానా అగచాట్లు పడుతున్నారు. లేఅవుట్లలో అంతర్గత రోడ్ల నిర్మాణం జరగకపోవడంతో లబ్దిదారుల జేబులకు చిల్లులుపడుతున్నాయి. సిమెంటు, ఇటుక, ఇనుము, పిక్క రాయి వంటి నిర్మాణ సామగ్రి ఇళ్ల స్థలాల వద్దకు చేర్చడానికి చేసిన ఖర్చు తడిసి మోపెడవుతోంది. సిసి రోడ్లు లేకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి రోడ్లు గుంతలుగా మారాయి. కొన్ని చోట్ల చెరువులను తలపించేలా రోడ్లు కనిపిస్తున్నాయి. దీంతో లబ్దిదారులు నిర్మాణంలో ఉన్న ఇళ్ల వద్దకు నిర్మాణ సామగ్రి చేర్చడం తలకు మించిన భారంలా మారింది. ఇంటర్నల్ రోడ్లు నిర్మించకుండా లబ్దిదారులను ఆదరాబాదరాగా ఇళ్లు నిర్మించాలని అధికారులు ఒత్తిడి చేశారు. దీంతో అప్పులు చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టిన పేదలు నరకయాతన అనుభవిస్తున్నారు. నిర్మాణ సామగ్రిని ఇళ్ల వద్దకు చేర్చడానికి అనువుగా రోడ్లు లేకపోవడంతో ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లు దూరంగా దించేస్తున్నారు. దీంతో లబ్దిదారులు నిర్మాణ సామగ్రిని వారి ఇళ్ల వద్దకు చేర్చడానికి అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. నెలిపర్తి-1, నెలిపర్తి -2 లేఅవుట్ లలో ఇళ్ల నిర్మాణం వేగంగా జరుగుతున్నప్పటికీ మౌలిక సదుపాయాలు లేకపోవడంతో పేదలు నరకయాతన అనుభవిస్తున్నారు.

ఏడాది క్రితం టెండర్లు

పట్టణానికి సంబంధించిన జగనన్న లేఅవుట్లలో ఇంటర్నల్ రోడ్ల నిర్మాణానికి టెండర్లు పిలిచి ఏడాదైంది. మున్సిపల్ ప్రజారోగ్య ఇంజనీరింగ్ శాఖ పర్యవేక్షణలో చేపట్టనున్న ఈ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. నెలిపర్తి లేఅవుట్ -1లో ఇంటర్నల్ రోడ్లు కోసం రూ.18లక్షలు మంజూరయ్యాయి. నెలిపర్తి-2లో ఇంటర్నల్ రోడ్ల నిర్మాణానికి రూ.36లక్షలు మంజూరయ్యాయి. ఏడాది క్రితం టెండర్లు ఖరారయ్యాయి. కానీ ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదు. దీంతో లేఅవుట్లలో ఇళ్లు నిర్మిస్తున్న లబ్దిదారులు నానా అగచాట్లు పడుతున్నారు.

నోటీసులు ఇచ్చినా స్పందించని కాంట్రాక్టర్లు

నెలిపర్తి లేఅవుట్లలో ఇంటర్నల్ రోడ్లు నిర్మాణానికి టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఏడాదైనా పనులు ప్రారంభించలేదు. దీంతో సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు రెండు నోటీసులు జారీ చేశారు. సకాలంలో పనులు ప్రారంభించలేదని అధికారులు నోటీసులు జారీ చేసినా ఫలితం లేకపోయింది. చేసిన పనులకు బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడం తో కాంట్రాక్టరు పనులు ప్రారంభించలేదని తెలుస్తోంది.

అధ్వానంగా ఉన్న జగనన్న కాలనీ రోడ్డు

కాంట్రాక్టర్లకు నోటీసులిచ్చాం

జగనన్న లేఅవుట్లలో ఇంటర్నల్ రోడ్లు నిర్మాణానికి టెండర్లు ఏడాది క్రితమే పిలిచాం. కాంట్రాక్టర్లు ఇంకా పనులు ప్రారంభించలేదు. రెండు నోటీసులు జారీ చేశాం. ప్రారంభించకపోతే తదుపరి చర్యలు తీసుకుంటాం.

- ఎల్.సూరినాయుడు,
ఇన్‌ఛార్జి డిఇ, మున్సిపాలిటీ

పేదల భూములను అటవీశాఖకు అప్పగించొద్దు



ఆందోళన చేస్తున్న గొట్టివలస, ఉల్లిభద్ర గ్రామస్తులు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని గొట్టివలస, ఉల్లిభద్ర రెవెన్యూ పరిధిలోని 79.5 ఎకరాల కొండ పోరంబోకు భూములను అటవీ శాఖకు అప్పగించేందుకు మండల రెవెన్యూ యంత్రాంగం ప్రయత్నించడాన్ని ఆ గ్రామాల ప్రజలు, దళితులు బుధవారం అడ్డుకున్నారు. ప్రతిపాదిత అటవీశాఖకు అప్పగించే అలోచన చేస్తున్న భూమిలో ఇప్పటికే 20 ఏళ్లుగా అనేకమంది సాగు చేసుకుని పట్టాలు పొంది ఉన్నారని, ఇంకా సాగు చేసుకుంటూ పట్టాలు పొందని వారు కూడా ఉన్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు సాగు చేసుకున్న భూమిని ఎలా అటవీశాఖకు అప్పగిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే ఈ విషయమై కలెక్టర్, ఇతర అధికారులకు అనేక సందర్భాల్లో తెలియజేశా మని, అయినా అధికారులు మొండిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ భూమికి అనుకొని సుంకి గ్రామ నిర్వాసితులకు పునరావాస కాలనీకి భూమి కేటాయించారని, నిర్వాసితులు, రైతులు తమ పశువులను, మేకలను పెంచుకునేందుకు ఈ భూమే ఆధారమని, అంతటి ప్రాధాన్యత కలిగిన భూమిని ఇతర అవసరాలకు బదలాయించడం సమంజసం కాదని అన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో చర్చి నిర్మించారని, వారి మనోభావాలను దెబ్బతీసేలా ప్రభుత్వం వ్యవహరించడం సమంజసం కాదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. కనీసం ప్రజలకు సమాచారం, పట్టాదారులకు నోటీసు ఇవ్వకుండా రెవెన్యూ యంత్రాంగం వ్యవహరిస్తుందని, దీనిపై న్యాయ పోరాటానికి రైతులు సిద్ధపడుతున్నారని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రజలకు అవసరమైన ఈ భూములను అటవీ శాఖకు బదిలాయించే ప్రయత్నం అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సుంకి సర్పంచ్ కరణం రవీంద్ర, బివి రమణ, బోనెల వెంకటి, బోను నాగభూషణరావు, బోను శంకర్రావు, బొండపల్లి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లు, డిగ్రీ కళాశాలు ఏర్పాటు చేయాలి

ఎస్‌ఎఫ్ఐ సైకిల్ యాత్రలో నాయకులు డిమాండ్

సీతానగరంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పండు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో వందల మంది విద్యార్థులు చదువుతున్నప్పటికీ సీతానగరంలో సంక్షేమ హాస్టల్, పోస్టుమెట్రిక్ హాస్టల్ ప్రభుత్వం నిర్మించకపోవడం చాలా దుర్మార్గమని ఎస్‌ఎఫ్ఐ కమిటీ విమర్శించింది. ఈ మేరకు ఎస్‌ఎఫ్ఐ చేపడుతున్న విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర మూడో రోజుకు సీతానగరం మండలం నుండి కొనసాగింది. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.పండు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసేలా తమ విధానాలను అనుసరిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన విద్యను అందించడంలో పూర్తిగా విఫలం చెందిందని విమర్శించారు. మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లి చదవలేక మధ్యలో చదువు నిలిపివేసే పరిస్థితి కనిపిస్తుందన్నారు. కావున ప్రభుత్వ వెంటనే స్పందించి మెరుగైన విద్యాభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో సీతానగరం మండల కేంద్రంలో సంక్షేమ, పోస్టుమెట్రిక్ హాస్టల్, డిగ్రీ కళాశాల ఏర్పాటుకై ఎస్‌ఎఫ్ఐ చేపడుతున్న పోరాట కార్యక్రమంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సంక్షేమ హాస్టలకు బకాయిలుగా నిలిచిన మెస్ (డైట్) బిల్లులు వెంటనే విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ బిల్లులు పెంచాలని, ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తొలగించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని లేనిచో యాత్ర అనంతరం పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రాజశేఖర్, నాయకులు కె.రాజు, హెచ్.సింహాచలం, బి.గంగారావు, కె.భాస్కరరావు, అఖిల్, ఉమాశంకర్, సిసింద్రీ, అన్నాజీ, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట: జిల్లా వ్యాప్తంగా ఎస్‌ఎఫ్ఐ చేపడుతున్న విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర బలిజిపేట మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు ఈ యాత్రకు స్వాగతం పలుకుతూ గ్రామంలో సైకిళ్లతో ర్యాలీ చేపట్టారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, పిఎస్ఎన్ జూనియర్ కళాశాలల విద్యార్థులతో ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి. రాజశేఖర్ మాట్లాడారు. మండలంలో డిగ్రీ కాలేజీ లేకపోవడంతో అనేక మంది విద్యార్థులు మధ్యలో చదువు నిలిపివేస్తున్నారని, కావున తక్షణమే ప్రభుత్వం డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని, పోస్ట్ మెట్రిక్ హాస్టల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో బలిజిపేట మండల కేంద్రంలో సంక్షేమ, పోస్టుమెట్రిక్ హాస్టలు మరియు డిగ్రీ కళాశాల ఏర్పాటుకై ఎస్‌ఎఫ్ఐ చేపడుతున్న పోరాట కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎన్ఇపి, 117 జిఒరద్దు చేయాలని, పాఠశాలల విలీనం ఆపాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లలో ఏఎన్ఎం లను నియమించాలని, లేకుంటే యాత్ర అనంతరం పెద్ద ఎత్తున్న ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

డిఎస్‌పిని సన్మానిస్తున్న ఎఎస్‌పి, పోలీసు అధికారులు

డిఎస్‌పికి ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మంగళగిరి పోలీస్ హెడ్ క్వార్టర్స్ కు బదిలీపై వెళ్తున్న రిజర్వ్ డిఎస్‌పి బలివాడ నాగేశ్వరరావుకు బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎఎస్‌ఒ డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్, అధికారులు, సిబ్బంది దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఎఎస్‌పి నాగేశ్వరరావు సేవలను కొనియాడారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల పెరేడ్ నిర్వహణ తదితర అంశాలలో క్రియాశీలకంగా వ్యవహరించారని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి సెల్ డిఎస్‌పి మురళీధర్, పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు, ఇన్‌స్పెక్టర్లు ఆర్.వి.ఎస్.కుమార్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అరసాడలో బ్యాంకు రుణమేళా

ప్రజాశక్తి - బలిజిపేట

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ చింతాడ బ్రాంచ్ ఆధ్వర్యంలో బుధవారం అరసాడలో బ్యాంక్ రుణ మేళాను క్షేత్రస్థాయి అధికారి జె.సుధీర్ కుమార్ సమక్షంలో నిర్వహించి ప్రజలకు రుణాలకు సంబంధించి అవగాహన కల్పించారు. రైతులకు డైరీ యూనిట్, వ్యవసాయ పనిముట్ల కోసం పిఎంఇజిపి రుణం, ఇన్సూరెన్స్ మొదలగునవి వివరించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఆఫీసర్ బి.నరేష్‌కుమార్, సర్పంచ్ పోల రామకృష్ణ, బ్యాంక్ మిత్ర పూసర్ల శ్రీనివాసరావు, విఒఎ గుల్ల భారతి తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా పర్యాటక పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ పరిధిలో పర్యాటక రంగం అభివృద్ధి పేరుతో 2018లో హడావుడిగా ప్రారంభించిన జగత్‌పల్లి, ఆడలివ్యూ పాయింట్లను ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న గిరిజన మ్యూజియం నిర్మాణాలు ఐదేళ్లు కావస్తున్నా ఎందుకు పూర్తి కాలేదో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, మండల కార్యదర్శి ఎ.భాస్కరరావు ప్రశ్నించారు. ఈ పనులు ప్రారంభం తర్వాత నలుగురు ప్రాజెక్ట్ అధికారులు మారినా పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న మాదిరిగా ఉండాలన్నారు. ఎన్నికల కోడ్ వచ్చేలోపు పనులు పూర్తయ్యేలా ప్రజాప్రతి నిధులు, అధికారులు చర్యలు చేపట్టి ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేయాలనీ డిమాండ్ చేశారు.

6న జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 6న జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జిజె ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ఆయన కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 13 మంది ఎంపిక

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తలవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన 13మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఉప్పాడ అప్పారావు బుధవారం తెలిపారు. ఉమ్మడి జిల్లా శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో గత నెల 25 నుండి 29 వరకు జిల్లా స్థాయి అండర్-17 విభాగంలో క్రికెట్, సిమ్మింగ్, బాల్ బ్యాడ్మింటన్, షూటింగ్ బాల్, తదితర పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికకావడంతో వ్యాయామ ఉపాధ్యాయులు వై.ధనలక్ష్మి, ఎం.రామకృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

గ్రామ సమస్యల పరిష్కార వేదిక గ్రామసభ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గ్రామంలో ఏ సమస్య ఉన్నా ఆ సమస్య పరిష్కారానికి గ్రామసభను ఒక వేదికగా మలుచుకోవాలని స్థానిక సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్రావు అన్నారు. బుధవారం సర్పంచి అధ్యక్షత గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల ఏర్పాటు ప్రజలకు ఎంతో మేలు చేసిందన్నారు. నేడు సచివాలయం ద్వారా ప్రజలు తమ అవసరాలను, సమస్యలను పరిష్కరించుకో గలుగుతున్నారన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు పనిచేస్తున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి శేఖర్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గిరిబాబు, సచివాలయం సిబ్బంది, వైస్ సర్పంచ్ కిషోర్, పంచాయతీ కార్యదర్శి కిషోర్, విఆర్‌ఒ హరికృష్ణ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 7 నుంచి కడప జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ (ఎస్‌జిఎఫ్) పోటీలకు స్థానిక ఎపి గిరిజన గురుకుల బాలికల పాఠశాల (పిటిజి) విద్యార్థిని ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఎన్.సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తమ పాఠశాలకు చెందిన 8వ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థిని బిడ్డిక కీర్తి రాష్ట్రస్థాయి అండర్ -17 వాలీబాల్ పోటీలకు ఎంపికైందన్నారు. ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన మేరకు పాఠశాల పిడి చంద్రమౌళి, పిఇటి అరుణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ తిరుపతిరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఐదో విడత కౌన్సిలింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

భద్రగిరి రెసిడెన్షియల్ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీకి ఐదో విడత కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సిహెచ్ సునీల్ కుమార్ తెలిపారు. కోపా, వెల్డర్, డ్రెస్ మేకింగ్ విభాగాల్లో చేరగోరే విద్యార్థులు ఈనెల 7లోగా ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. 9న కౌన్సిలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కాలువల్లో పూడికల తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని పలు వార్డుల్లోని కాలువల్లో పూడికలను పారిశుధ్య కార్మికులు తొలగించారు. కాలువలు కంపు కొడుతున్నాయి అన్న శీర్షికతో 'ప్రజాశక్తి'లో బుధవారం ప్రచురితమైన వార్తకు కమిషనర్ జె.రామఅప్పల నాయుడు స్పందించారు. ఈ మేరకు పట్టణంలోని 27వ వార్డు శిరెలవీధిలో ఉన్న కాలువలను మున్సిపల్ ప్రజారోగ్య అధికారి సిహెచ్ మురళీ ఆధ్వర్యాన పూడికలను తొలగించారు. కాలువల్లో పూడికలు తొలగించడంతో స్థానికులతో పాటు ఆ రహదారి గుండా రాకపోకలు సాగించే వాహన చోదకులు హర్షం వ్యక్తం చేశారు.

సైబర్ చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్థానిక నారాయణ స్కూల్‌లో చదువుతున్న బాల, బాలికలకు బుధవారం దిశా ఎస్ఐ లావణ్య అధ్వర్యంలో చెడు స్పర్శ, మంచి స్పర్శకు గల తేడాలు గురించి అవగాహనా కల్పించారు. అలాగే ఆర్‌కె జూనియర్ కాలేజీలో విద్యార్థులకు దిశా యాప్, సైబర్ నేరాలు, మహిళలకుఉపయోగపడే చట్టాలు తదితర అంశాలపై అవగాహనా ఏర్పర్చి తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బందితో పాటు దిశా కానిస్టేబుల్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు

ప్రజాశకి - గరుగుబిల్లి

గర్భిణీలు, బాలింతల్లో రక్తహీనత నివారించేందుకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారం విధిగా తీసుకోవాలని కొమరాడ ఐసిడిఎస్ పిఒ గొట్టాపు సుగుణకుమారి అన్నారు. మండలంలోని చినగుడబలో బుధవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణీలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ పిఒతో పాటు సూపర్వైజర్లు రౌతు లక్ష్మి, అరుణకుమారి గర్భిణులకు గాజులు, జాకెట్ ముక్కలు, పళ్ళు, స్వీట్లు, అందజేశారు. కార్యక్రమంలో పిహెచ్‌సి హెచ్‌వి సిహెచ్ ఉదయకుమారి, అంగన్వాడీ వర్కర్లు చింతాడ గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

జెఎఎస్‌తో ప్రతి కుటుంబానికీ ఉచిత వైద్యం

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని పుట్టూరు సచివాలయం పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన వైద్యశిబిరంలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీస్తూ తాను కూడా బిపి, షుగర్, హిమోగ్లోబిన్ వంటి వైద్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలను తీసుకున్నారు. అనంతరం ఇక్కడ సచివాలయం పరిధిలో ఉన్న ప్రజలు అందరికీ ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు మందులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఎంపిపి మజ్జి శోభారాణి, స్థానిక సర్పంచ్ గుంటిరెడ్డి సతీష్ కుమార్, ఎంపిటిసి ఎగిరెడ్డి రమణమూర్తి, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, ఆత్మ చైర్మన్ వై తిరుపతిరావు, సీనియర్ నాయకులు వి.దానబాబు, పలువురు నాయకులతో పాటు ఎంపిడిఒ, తహశీల్దార్, వైద్య శాఖల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని గొయిది సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష, ఉచిత వైద్య పరీక్షలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి, ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి పాల్గొన్నారు. వైద్యశిబిరానికి వచ్చిన వారందరికీ ఉచిత ఆరోగ్య పరీక్షలు చేస్తూ ఇంటింటికి వెళ్లి వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపిపి బిడ్డిక ఆదినారాయణ, జెడ్పీటీసీ ప్రతినిధి సవర రాము, ఎంపిడిఒ కె.గీతాంజలి, వైద్యాధికారి రవీంద్ర, సిడిపిఒ రంగలక్ష్మి, స్థానిక ఎంపిటీసీ నిమ్మక హరిప్రసాద్, సర్పంచులు, కన్వీనర్లు, ఎంపిటిసిలు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని నిడగల్లులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని టిట్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు, ఎంపిడిఒ కృష్ణమహేష్ రెడ్డి, జెఎఎస్ నోడల్ అధికారి డాక్టర్ ఎం.వినోద్ తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్ కౌంటర్, స్పాట్ సర్వే విభాగం, వైద్యులు తనిఖీ విభాగం, ల్యాబ్ పరీక్షలు, ఫార్మసీ కౌంటర్లను పరిశీలించారు. ఎంతమందికి టోకెన్లు అందజేశారు, నిర్వహించిన పరీక్షలు, నమోదు చేసిన రోగుల వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. ఆరోగ్యశ్రీ యాప్‌ను అందరికీ డౌన్లోడ్ చేయించి ప్రయోజనాలను వివరించాలన్నారు. మందులు వినియోగించు విధానాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. కంటి వైద్య శిబిరంలో ఎంత మందికి తనిఖీలు జరిపారు, కళ్లజోళ్లు వివరాలపై ఆరా తీశారు. అంగన్వాడీ స్టాల్స్ ను పరిశీలించి అక్కడ ఏర్పాటు చేసిన పౌష్టికాహారం గురించి ఎంత మంది గర్భిణీలు, బాలింతలకు అవగాహన కల్పించారని అడిగారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాయిపల్లి. ఆరుద్ర, వైస్ ఎంపిపి తోడబండి సూర్యనారాయణ, వైద్యాధికారి డాక్టర్ రాధాకాంత్, ఎఒ ఎంఎల్ఎన్ ప్రసాద్, పంచాయతీ సెక్రటరీ తిరుపతి, ఎంఇఒ సూరిదేముడు, వైద్యులు, స్పెషలిస్ట్ వైద్యులు, వైద్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది,అంగన్వాడీ సిబ్బంది,గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

వీరఘట్టం : గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి డి.వెంకటరమణనాయుడు గ్రామస్తులకు సూచించారు. మండలం హుస్సేనపురంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచి టి.లక్ష్మి, తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, ఎంపిడిఒ బిజె ప్రసాద్, ఎంపిటిసి ఎన్.రాముడమ్మ, డొకల సుజాత, వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, ఎస్ నితీష, సచివాలయ కార్యదర్శి జె.షణ్ముఖరావు, వైద్య, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం స్టాల్ ఏర్పాటు

గరుగుబిల్లి : మండలం పరిధిలోని చినగుడబగ్రామంలో బుధవారం అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్‌ను జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రోగ్రాం అధికారి డాక్టర్ ధవళ భాస్కరరావు సందర్శించారు. ఈ సందర్భంగా స్టాల్‌లో ప్రదర్శించిన పౌష్టికాహారానికి సంబంధించిన శెనగచక్కీలు, బెల్లంఅరిసెలు, బాలామృతంతో చేసిన లడ్డూలు, నువ్వు ఉండలు, కూరగాయలు, ఆకుకూరలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతల్లో రక్తహీనతను నివారించేందుకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి గొట్టాపు సుగుణ కుమారి, సూపర్వైజర్లు రౌతు లక్ష్మి, పి.అరుణకుమారి, అంగన్వాడీ వర్కర్లు చింతాడ గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : మండలంలోని వబ్బంగి సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. సచివాలయ పరిధిలో గల పిహెచ్‌సి వైద్యాధికారులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వివి శివరామప్ప, పంచాయతీ కార్యదర్శి కె.చంద్రశేఖర్, వైద్య అధికారులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భామిని: మండలంలోని కాట్రగాఢ -బి లో బత్తిలి వైద్యాధికారులు కొండపల్లి రవీంద్ర, డా.దామోదర్, డా. సోయల్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో 365 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసిన,16 మందికి రెఫెర్ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం, ఎంపిడిఒ చంద్రరావు, డిప్యూటీ తహసీల్దార్ శేఖరం, ఎంఇఒ భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసరావు, కలిశెట్టి సంతోష్ పాల్గొన్నారు.

సీతంపేటలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఐటిడిఎ పిఒ

జెకెసికి 50 వినతులు

పిఒకు వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 50 అర్జీలు అందాయి. అర్జీదారుల నుండి పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి విష్ణు చరణ్, ఆర్డీవో కె.హేమలత వినతులను స్వీకరించారు. వీటిలో భూ సమస్యలు పరిష్కరించాలని, సామాజిక పింఛన్లు పునరుద్ధరించాలని, ఇళ్ల స్థలాలు మంజూరు, కట్టిన ఇళ్లకు బిల్లులు చెల్లింపులకు అర్జీలను అందజేశారు. అనంతరం పిఒ మాట్లాడుతూ జగనన్న కు చెబుదాం కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన వినతులను క్షేత్ర స్థాయిలో సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఏనుగులను వెంటనే తరలించాలి : సిపిఎం

గుమ్మలక్ష్మీపురం: పంటలను నాశనం చేస్తూ, ప్రజల ప్రాణాలను తీస్తున్న అడవి ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరలించాలని ఐటిడిఎ పిఒకు సిపిఎం నాయకులు వినతి ఇచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ 2007 నుంచి ఏనుగులు మండలంలో సంచరిస్తూ ప్రజల ప్రాణాలు, ఆస్తులకు నష్టం చేకూరుస్తున్నాయన్నారు. మూడు ప్రభుత్వాలు మారినా ఏనుగులను తరలించలేనిపరిస్థితుల్లో ప్రభుత్వాలు ఉన్నాయని అన్నారు. గత పది రోజులుగా రామినాయుడు వలస, పెదమేరంగి, గౌరమ్మ పేట, సీమనాయుడు వలస, బాసంగి, పరజపాడు, పిప్పల భద్ర, కేటీవాడ, నీచకువలస గ్రామాల్లో పంటలు నాశనం చేస్తున్న ఏనుగులను వెంటనే తరలించాలని కోరారు. అలాగే పార్వతీపురం నుంచి జియ్యమ్మవలస మీదుగా టికే జమ్ముకు బస్సు నడపాలని కోరారు. సుమారు 50 గ్రామాల గిరిజనులు మండల కేంద్రానికి రావాలంటే బస్సు సౌకర్యం లేదని, కురుపాం మీదుగా రావాల్సిన పరిస్థితులు ఉన్నాయని, కావున బస్సు నడపాలని కోరారు. వినతిని అందజేసిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి కోరంగి సీతారాం, నాయకులు భూతాల మోహన్రావు సోమయ్య బలరాం పాల్గొన్నారు. అలాగే దీర్ఘకాలిక గిరిజన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘ అధ్యక్షు, ఉపాధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్, ఆరిక చలపతిరావు, నాయకులు ఎస్.మణికేశ్వరావు, సింహాచలం, తదితరులు ఉన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలంటూ నిరసన తెలుపుతున్న గిరిజనులు

సీసాడవలసకు రోడ్డు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని చినఖర్జేల పంచాయతీ సీసాడవలసకు రోడ్డు సౌకర్యం కల్పించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. సీసాడవలస సమీపంలో రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ బుధవారం చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ గ్రామానికి ఎన్నో ఏళ్లుగా రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఈ పక్కనే గెడ్డను దాటి తమ గ్రామానికి వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. కోటా బియ్యం కూడా తమ గ్రామానికి రాని పరిస్థితి ఉందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇద్దరు పిల్లలు ఈ గెడ్డలో కొట్టుకుపోగా గ్రామస్తులంతా కాపాడారన్నారు. కావున ఈ గ్రామానికి రహదారి సౌకర్యం ఇప్పటికైనా కల్పించాలని కోరారు. నిరసనలో గిరిజన సంఘం నాయకులు సంగమ్మ, సోములు, చిలకమ్మ, ఆ గ్రామ గిరిజనులు పాల్గొన్నారు.

దేవానంద్‌ను సన్మానిస్తున్న సాహితీవేత్తలు

దేవానంద్‌కు సన్మానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని దిగువమండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న పాలక దేవానంద్‌ను జ్యోతి, ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్, ఆలూరి కల్చరల్, సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని త్యాగరాయ గానసభలో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుడుగా పని చేస్తూ మరోవైపు ఖాళీ సమయంలో నాటికలు, కథలు, బాలసాహిత్యం, రచనలు రాయడంలో మంచి ప్రతిభ కనబరుస్తున్నారు. పలు పుస్తకాల్లో రచించిన, ఆలపించిన కవితలు, పాటలు ఎంతగానో గుర్తింపు పొందాయి. దేవానంద్ ప్రతిభను గుర్తించిన సాహితీ సంస్థలు సన్మాన సత్కారాలతో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను గుర్రం జాషువా జాతీయ పుష్కారానికి ఎంపిక చేసి సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. దేవానంద్‌ను సన్మానించడం పట్ల ఏజెన్సీ కవులు ఉమామహేశ్వరరావు, పెద్దింటి నిర్మల్ కుమార్, హరిగోపాల్, శేషగిరి, శేఖర్, సూర్యనారాయణ, శైలజ, ప్రజా ప్రతినిధులు, అభినందించారు.

పొలంబడిలో కీటక ప్రదర్శనశాల ఏర్పాటు

ప్రజాశక్తి - పాచిపెంట

మిత్ర, శత్రువులను గుర్తించి మిత్ర పురుగులను సంరక్షిస్తూ పర్యావరణానికి హాని జరగకుండా తక్కువ ఖర్చుతో నిరంతర పంట పరిసరాల విశ్లేషణ ద్వారా ఆరోగ్యవంతమైన పంటను పండించడమే డాక్టర్ వైయస్సార్ పొలంబడి లక్ష్యమని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని అమ్మవలసలో డాక్టర్ వైయస్సార్ పొలంబడి కార్యక్రమంలో మాట్లాడుతూ విచక్షణారహితంగా పురుగుమందులను వాడడం వల్ల శత్రు పురుగులతో పాటు మిత్ర పురుగులు కూడా చనిపోతాయన్నారు. మిత్ర, శత్రుపురుగుల గుర్తింపు కోసమే పొలంబడిలో కీటక ప్రదర్శనశాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు మ్యాజిక్ వరి బియ్యాన్ని ప్రదర్శించారు. ఈ బియ్యం నీటిలో వేసిన అరగంటలో అన్నంగా మారుతుందని, దీన్ని వండుకోనవసరం లేదని తెలిపారు. ఇది తెలంగాణలో కరీంనగర్ జిల్లాలోని ఒక రైతు పండిస్తున్నాడని తెలుపుతూ నీటిలో వేసిన బియ్యం అందంగా మారడాన్ని మహిళా రైతులకు చూపించారు.

పంచాయతీ కార్యదర్శిపై దర్యాప్తు

ప్రజాశక్తి - కొమరాడ

స్థానిక సచివాలయంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి గణపతిపై ఉన్న ఆరోపణలపై అధికారులు దర్యాప్తు చేశారు. ఇఒపిఆర్‌డి ఎం.రాధాకృష్ణ బుధవారం కొమరాడ గ్రామ సచివాలయంలో దర్యాప్తు నిర్వహించారు. సచివాలయంలో పనిచేసిన సందర్భంలో గ్రామ కార్యదర్శి గణపతిపై జరిగే ఆరోపణలపై కొమరాడకు చెందిన మరడాన శంకర్రావు గంట సత్యనారాయణ కొన్ని రోజుల క్రితం ఎంపిడిఒకు ఫిర్యాదు చేసిన మేరకు బుధవారం గ్రామ పెద్దల సమక్షంలో విచారణ చేపట్టారు. ఫిర్యాదు దారులు ఇచ్చిన సమాచారం మేరకు ఇక్కడ జరిగిన విషయాలన్నీ పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి ఎంపిడిఒకు తెలియజేస్తామని ఇఒపిఆర్‌డి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మరడాన సింహచలంనాయుడు, మరడాన సూరపు నాయుడు, కొల్లి సాంబమూర్తి, గులిపల్లి చిన్నసుధ, సిరికి సింహాచలం, గంట ఆదిబాబు, మరడాన రామకృష్ణ పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - భామిని

పోకాహారంపై అవగాహన తప్పనిసరిని ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి అన్నారు. సంకల్ప్ సప్తహ్ కార్యక్రమంలో స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో పిఒ శాంతి భవానీ ఆధ్వర్యంలో సమృద్ధి ఆహార మేర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను అందంగా అలకరించారు. అనంతరం పిఒ కల్పనాకుమారి పోషకాల ప్రాముఖ్యతపై గర్భిణులకు అవగాహన కలిగించారు. గర్భిణీలు, బాలింతలు, పిల్లల ఆరోగ్య సంరక్షణలో భాగంగా పోషకాలు ప్రాముఖ్యత తెలుసుకోవాలని ఎంపిపి శాంతి కుమారి తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతి లక్ష్మి, గురిబిల్లి సబిత, మహిళా పోలీస్ చందన, గర్భిణులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టిడిపి రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా మండలంలోని ఖడ్గవలస జంక్షన్లో టిడిపి పిలుపు మేరకు రిలే నిరాహార దీక్షలు మాజీ మంత్రి శత్రుశర్ల విజయరామరాజు, కురుపాం నియోజకవర్గం ఇన్చార్జి తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు అక్కేన మధుసూదనరావు, ఎం.పురుషోత్త మనాయుడు, ఎం.తవిటినాయుడు, అంబటి రాంబాబు, ఎంబి విజయాంకుశం, మండల కన్వీనర్లు శేఖర్ పాత్రుడు, సుదర్శన్‌రావు, నాయకులు నంగిరెడ్డి మధుసూదన్‌రావు, ఎంపిపి బొంగు సురేష్, పి.వెంకట నాయుడు, కోల రంజిత్, ఎం.సింహాచలం. యామల శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట : నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్‌కు నిరసనగా సీతంపేటలో బాబుతో నేను నిరాహార దీక్షలు చేకొసాగాయి. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని, ఎటువంటి అవినీతి మరకలేని నాయకుడిపై కేసులు బనాయించి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారంటూ పాలకొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ నిమ్మక జయకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నెన అప్పలనాయుడు, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, మండల పార్టీ అధ్యక్షులు సవర తోట మొఖలింగం, బిసి సెల్ అధ్యక్షులు ఆర్.రంగనాధం, క్లస్టర్ ఇంచార్జ్ నిమ్మక చంద్రశేఖర్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరఘట్టం: చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ బాబుకు మేము తోడు అంటూ మండల కేంద్రంలోని సైకిల్ యాత్రను కొనసాగించారు. రణస్థలం మండలం నారువకు చెందిన మాజీ సర్పంచ్ ఎం.రామకృష్ణ ,ఆదినారాయణ, సుందరరావు, ఎస్.రమేష్, సిహెచ్ రామ్మూర్తి ఈనెల 2న గాంధీ జయంతి రోజున నారువలో సైకిల్ యాత్ర ప్రారంభించి శ్రీకాకుళం, పలాస, సోంపేట, పాతపట్నం, పాలకొండ, వీరఘట్టం, పార్వతీపురం పర్యటించి కుప్పం వరకు సైకిల్ యాత్ర కొనసాగిస్తామని వారు తెలిపారు.

గుమ్మలక్ష్మీపురం : టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు అరెస్టు అన్యాయమని అరకు పార్లమెంట్ ఎస్‌టి సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు అన్నారు. జియమ్మవలస మండలం డంగభద్రలో బాబుతో నేను కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. చంద్రబాబు అక్రమం అరెస్టుకు నిరసన తెలిపారు. వైసిపి ఎన్ని కుట్రలు పన్నిన 2024 ఎన్నికల లో టిడిపి విజయం ఖాయం అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పల్ల రాంబాబు, క్లస్టర్ ఇంచార్జ్ బుజంగారావు, ఎంపిపి బొంగుసురేష్ అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

వన్య ప్రాణులను రక్షించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వన్య ప్రాణులను రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని కురుపాం అటవీ శాఖ రేంజర్ మణికంఠ అన్నారు. వన్య ప్రాణుల వారోత్సవాల సందర్భంగా మండలంలోని ఎల్విన్‌పేట పంచాయితీ ఎస్‌కె పాడులో బుధవారం మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పర్యావరణాన్ని రక్షిస్తే వన్యప్రాణులకు రక్షణ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, పర్యావరణాన్ని రక్షించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక అటవీశాఖాధికారి భాస్కరరావు, గార్డులు రామారావు, తిరుమల, డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అటవీ శాఖ సిబ్బంది ఉన్నారు.

సింహాచలం కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తెట్టంగికి చెందిన ముదిలి సింహాచలం ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి నిమ్మక జయకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. సింహాచలం మృతికి గల కారణాలు అడిగి తెలుసుకొని కుటుంబాన్ని ఓదార్చారు. ఆయనతో పాటు రాష్ట్ర కార్యదర్శి కర్నేని అప్పలనాయుడు, ఎఎంసి మాజీ చైర్మన్ పి.కృష్ణమూర్తి నాయుడు, వండాన కృష్ణమోహన్, భాను బాబు, వంజరాపు రమేష్, కుర్మినాయుడు, రవి, ముదిలి జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారుల భద్రతే ముఖ్యం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలో ఎట్టిన్న గుడి జంక్షన్ నుండి వంగర వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న మొక్కలను జెసిబి సహాయంతో బుధవారం తొలగించినట్టు ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపారు. వాహనదారులు ప్రయాణించేటప్పుడు మలుపులు వద్ద వాహనాలను నిమ్మదిగా వెళ్లాలని అన్నారు. రోడ్డు భద్రత ప్రమాణలను పాటించి ప్రయాణం చేయాలన్నారు.

బెల్టు షాపు నడుపుతూ పట్టుబడ్డ వ్యక్తి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని బురద వెంకటాపురంలో అక్రమంగా బెల్టు షాపు నడుపుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు బుధవారం సోదాలు నిర్వహించగా కేతిరెడ్డి తిరుపతి నాయుడు నుంచి 26 మద్యం బాటిల్లు ఉండడంతో ఆయన్ను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపారు. అనంతరం అతనిపై కేసు నమోదు చేసి అడిషనల్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వద్ద హాజరు పరచగా 14 రోజు రిమాండ్ విధించారన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

ప్రజాశక్తి -వీరఘట్టం

మండల కేంద్రంలోని సాయి నగర్ కాలనీకి చెందిన ఆలుబిల్లి కుమార్ (19) అనే విద్యార్థి విద్యుత్ ఘాతానికి గురై బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కలగొప్పిలో భాగంగా వరి చేనుకు కోబలి జల్లేందుకు వీలుగా టేకు ఆకులు అవసరం ఉండడంతో ఆర్ అండ్ బి బంగ్లాకి సమీపంలో ఉన్న టేకు తోట వద్దకు వెళ్లి టేకు చెట్టు వద్దకు కుమార్ వెళ్లాడు. ఈ చెట్టుకు అనుకొని విద్యుత్ వైర్ ఉండడాన్ని గమనించక పోవడంతో చెట్టు ఎక్కి కొమ్మ కొడుతుండగా కొమ్మ వెళ్లి వైర్ మీద పడడంతో ఆ కొమ్మ విద్యార్థికి తగలడంతో విద్యుత్తు చాకుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో పక్కనే ఉన్న గ్రామస్తులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమారమిచ్చారు. కుమారుడి మృతి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరై విలపించడంతో పలువురు కంటతడి పెట్టారు. కుమార్ పాలకొండలోనే తమ్మినాయుడు డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కుమార్‌కు తల్లిదండ్రులు సూరీడమ్మ, మజ్జిశ్వరరావు, అన్నయ్య, చెల్లెలు ఉన్నారు. తండ్రి మజ్జిశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం వెంకటరమణ తెలిపారు.

మృతి చెందిన కుమార్

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పి.కోనవలసకు చెందిన వుల్లింకల రమణ ట్రాక్టర్ ఢీకొని మృతి చెందాడు. కుటుంబ సభ్యుల తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రమణను మంగళవారం రాత్రి గ్రామ సమీపానున్న ఇటుకల బట్టీ వద్ద ట్రాక్టర్ ఢీకొనడంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఫక్రుద్దీన్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బెలగాం

స్థానిక బెలగాం రైల్వే స్టేషన్ సమీపాన గుర్తు తెలియని మృతదేహం గుర్తించినట్టు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు 60 ఏళ్లు ఉండొచ్చని, అతడు నలుపు రంగు నిక్కరు, తెలుగురంగుపై నీలం రంగు గడుల చొక్కా ధరించి ఉన్నాడు. అలాగే తెలుపు రంగు గెడ్డం ఆనవాళ్లుగా గుర్తించారు. రైల్వే ఎస్ఐ రవివర్మ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

320 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

ఆంధ్రా- ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో వేర్వేరు చోట్ల జరిపిన సోదాల్లో ఒడిశా నుంచి మండలంలోని బాలగోడబకు తరలిస్తున్న అక్రమసారాయిని రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం జరిపిన రోజువారీ తనిఖీల్లో మండలంలోని రావికోన, బట్టివలస గ్రామాల్లో బాలగోడబ గ్రామానికి చెందిన బంగారి కృష్ణ, సిరికొరకు అఖిల్ వేర్వేరుగా వాహనాలపై 16 కేన్లతో 320 లీటర్ల సారాయిని ఒడిశా నుండి తీసుకు వస్తుండగా పట్టుకున్నారు. వారి నుంచి రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సారా తరలిస్తుండగా దంపతులు అరెస్టు

ప్రజాశక్తి - పాచిపెంట

ఒడిశా నుంచి సాలూరుకు అక్రమంగా నాటుసారా తరలిస్తున్న భార్యాభర్తలను పోలీసులు కోనవలస చెక్‌పోస్ట్ వద్ద పట్టుకున్నారు. వీరి నుంచి ఆటో, 50 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని అదుపులోకి తీసుకున్నారు. బుధవారం వీరిని కోర్టులో హాజరు పర్చినట్టు ఎస్ఐ ఫకృద్దీన్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.